

'సర్వేకు పాఠశాల సిబ్బందినే కేటాయించడాన్ని ఖండిస్తున్నాం'

కామారెడ్డి టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేను ప్రాథమిక పాఠశాల సిబ్బందికి మాత్రమే కేటాయించడాన్ని ఖండిస్తున్నామని జిల్లా ప్రైమరీస్కూల్స్ హెడ్‌మాస్టర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్‌కుమార్ గౌడ్, రాజేష్‌లు అన్నారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు కూడా కేటాయించాలని కోరుతున్నామన్నారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాల్సింది పోయి ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే విధంగా కేవలం ప్రాథమిక పాఠశాలలో మాత్రమే సిబ్బందిని కేటాయించడం వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు.



పోచారం ప్రాజెక్టు

ఆదివారం ప్రత్యేకం

చలో చలో.. పోచారం

- పోచారానికి పర్యాటక శోభ
- నిండుకుండలా పోచారం ప్రాజెక్టు
- లవ్‌బర్డ్స్ వలస పక్షులకు ప్రాజెక్టు ఆతిథ్యం
- కనువిందు చేస్తున్న అభయారణ్యం
- పర్యాటక స్థలంగా అభివృద్ధి చేస్తే పెరగనున్న పర్యాటకుల తాకిడి
- ప్రతిపాదనలకే పరిమితమైన ప్రాజెక్టు, అభయారణ్యం అభివృద్ధి
- గతంలో ప్రాజెక్టులో బోటింగ్ నిర్వహణ.. పునరుద్ధరించాలంటున్న పర్యాటకులు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామంటున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్

కామారెడ్డి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పోచారం ప్రాజెక్టు, అభయారణ్యం ప్రాంతాలు ఆదివారం వచ్చిందంటే చాలు పర్యాటకులతో సందడి నెలకొంటుంది. కామారెడ్డి-మెదక్ ఉభయ జిల్లాలకు పోచారం ప్రాజెక్టు, అభయారణ్యం మరింత గుర్తింపును తెచ్చి పెడుతోంది. ఓ వైపు పోచారం అభయారణ్యంలో వన్యప్రాణులు, మరో వైపు అటవీ ప్రాంతం, ఇంకో వైపు పంటపొలాలు ఉన్న పోచారం ప్రాజెక్టు అందాలు చూసేందుకు రెండు కళ్లు చాలవు. సమీపంలోనే నిజాం హయాంలో నిర్మించిన జలాశయం అలుగుపారే దృశ్యాలు చూడటం మరింత కనువిందు చేస్తోంది. కామారెడ్డి - మెదక్ జిల్లాలోని సరిహద్దులో పర్యాటకశోభను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడితే మంచిదని పర్యాటకులు కోరుతున్నారు. కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట మండలంలో పోచారం ప్రాజెక్టును నిజాం కాలంలో నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా నాగిరెడ్డిపేట్ మండలం, ఎల్లారెడ్డి మండలాలకు సాగు, తాగు నీరు అందుతోంది. ఈ వర్షాకాలంలో భారీ వర్షాలు కురవడంతో ఎగువ నుంచి వచ్చిన వరద నీరు భారీగా ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. దాదాపు ప్రాజెక్టు అలుగు పారడంతో పర్యాటకుల సందడి నెలకొంటుంది. ప్రస్తుతం ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ఈ ప్రాజెక్టు వద్దకు ఇతర దేశాల నుంచి వలస పక్షులు వస్తుండటంతో వాటిని చూసేందుకు పర్యాటకులు వస్తున్నారు.



జలాశయం మధ్యలో ఉన్న పెద్దగుట్ట

సెలవు దినాల్లో వందల సంఖ్యలో పర్యాటకులు

పోచారం ప్రాజెక్టు, అభయారణ్యం హైదరాబాద్ మహా నగరానికి దగ్గర ఉండటంలో సెలవుదినాల్లో ఈ ప్రాంతానికి వందల సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ప్రాజెక్టు నిండుకుండలా ఉండటం అలుగు పారడంతో పర్యాటకుల సందడి విపరీతంగా పెరిగింది. ఆదివారం వచ్చిందంటే చాలు ప్రాజెక్టు, అభయారణ్యం పర్యాటకులతో కళకళలాడుతోంది. హైదరాబాద్ నుంచి వచ్చే వారు మెదక్‌లో ఉన్న ప్రముఖ చర్చిని సందర్శిస్తున్నారు. అక్కడి నుంచి నేరుగా పోచారం అభయారణ్యంలో వన్యప్రాణులను చూసి ముచ్చట పడుతున్నారు. కుటుంబ సమేతంగా, స్నేహితులతో కలిసి అభయారణ్యం తిరుగుతూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తు న్నారు. అభయారణ్యంలోని జింకలు, నెమళ్లు, కొండ గొర్రెలు, అడవి పందులు, కుందేళ్లను చూస్తు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అక్కడి నుంచి సమీపంలో ఉన్న పోచారం ప్రాజెక్టును చూసి ఆనందంగా గడుపుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాజెక్ట్, అభయారణ్యం ప్రాంతంలో సమయాన్ని కేటాయించే పర్యాటకులకు స్థానికంగా ఎలాంటి సదుపాయాలు, సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందిగా మారు తోంది. కనీసం మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. అలాగే స్థానికంగా క్యాంటిన్ సౌకర్యం ఏర్పాటు చేస్తే బాగుంటుందని పర్యాటకులు కోరుతున్నారు. ప్రాజెక్టు వద్ద ఉన్న రెండు అతిథి గృహాలకు మరమ్మతులు చేస్తే ఎంతో ఉపయోగంలోకి వస్తాయని పర్యాటకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

లవ్‌బర్డ్స్‌కి ప్రాజెక్టు ఆతిథ్యం

పోచారం ప్రాజెక్టు చుట్టూ అభయా రణ్యం, పచ్చని పంట పొలాలు ఉండటంతో లవ్‌బర్డ్స్ లాంటి వలసపక్షులకు ప్రాజెక్టు ఆతిథ్యం ఇస్తోంది. విదేశాల నుంచి నవంబరు, వేసవి మాసాల్లో ఈ లవ్‌బర్డ్‌లు సేద తీరేందుకు పెద్దసంఖ్యలోనే ప్రాజెక్టుకు వచ్చి చేరుతాయి. ఉదయం, సాయంత్రం సమయంలో ఈ లవ్‌బర్డ్ పక్షులు ప్రాజెక్టులోని జలాశయంలో కనువిందు చేస్తుంటాయి. వీటిని చూసేందుకు కామారెడ్డి, మెదక్, హైదరా బాద్ లాంటి నగరం, పట్టణాల నుంచి పెద్ద సంఖ్యలోనే పర్యాటకులు వస్తుంటారు. ఈ సంవత్సరం ప్రాజెక్టు నిండుకుండలా ఉండటంతో లవ్‌బర్డ్స్‌తో పాటుగా ఇతర పక్షులు వలసకు వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

గతంలో జలాశయంలో బోటింగ్ నిర్వహణ

పోచారం ప్రాజెక్టు మధ్యలో ఉన్నటువంటి పాత గుట్ట పర్యాటకులను ఆకర్షిస్తోంది. పాజెక్టు వద్ద బోటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు గత 7 సంవత్సరాల కిందట మెదక్ కలెక్టర్ బోటింగ్ ట్రయల్ రన్ చేశారు. బోటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు జలాశయం మధ్యలోనే పెద్దగుట్ట పై హరితహారం హోటల్‌ను, గార్డెన్, మ్యూజియంను ఏర్పాటు చేసినట్లయితే పర్యాటకులను కూడా మరింత ఆకర్షించవచ్చని అప్పట్లో భావించారు. ఈ ప్రాజెక్టులో బోటింగ్ కొన్నిరోజుల పాటు అధికారులు నిర్వహించారు. పర్యాటకుల సౌకర్యార్థమై ఈ బోటింగ్ ఏర్పాటు చేసి ప్రాజెక్టు మధ్యలోని గుట్ట వరకు తీసుకెళ్లేవారు. ప్రాజెక్ట్‌కు పాతగుట్ట ప్రత్యేక ఆకర్షణగా ఉండడంతో గత ప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను రూపొందించింది. ఈ గుట్టపై హరితహారం హోటల్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. బోటింగ్ షికారు చేసేవారు అక్కడికి వెళ్లి కొద్దిసేపు సేదతీరేందుకు కొత్త గార్డెన్‌ను ఏర్పాటు

(మిగతా 8వ పేజీలో)

అభయారణ్యంలో సంచరిస్తున్న జింకలు, నెమలి







ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి



అతిథి గృహం



ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన గార్డెన్



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు రాష్ట్ర సర్కారు సన్నాహాలు

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ
- సర్వేకు ప్రజలు సహకరించాలి : పోచారం
- సర్వేతో ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ : మదన్‌మోహన్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ, పక్కన పోచారం, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తదితరులు

కామారెడ్డి టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):తెలంగాణలో సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేకు రాష్ట్రప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతీలో కులగణన, సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేకు సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. గతంలో మండలి ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు బీసీ కులగణనపై ఇదే విషయాన్ని తాను లేవనెత్తానన్నారు. కురమలు గొర్రెల కాయాల, కుమ్మరులు కుండలే చేయాలా, మంగలి తన వృత్తి మాత్రమే చేయాలా, చాకలి బట్టలు మాత్రమే ఉతకాలా!? అని ప్రశ్నిస్తే ఆ మాటలను స్పీకర్ ద్వారా రికార్డుల నుంచి తొలగించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ద్వారా కామారెడ్డిలోనే బీసీ డిక్లరేషన్ విడుదల చేసిందని అన్నారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ ప్రోద్భలంతో దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపడుతున్నామని అన్నారు. తెలంగాణలో సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేకోసం 3 రోజుల పాటు ఇళ్ల గుర్తింపు కార్యక్రమాన్ని చేపడుతారని అన్నారు. సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఈనెల 6 నుంచి జరగనున్న సమగ్ర కులగణనలో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. భవిష్యత్తులో అన్ని పథకాలకు ఈ సర్వే ఆధారంగానే ఉంటాయని తెలిపారు. కులగణనకు తెలంగాణ సర్కారు యంత్రాంగం సన్నద్ధమవుతోందన్నారు. జిల్లాలో ఇప్పటికే ఇళ్ల గుర్తింపు పూర్తిచేశారని ఈనెల 6 నుంచి సర్వే ప్రారంభమవుతున్న దృష్ట్యా ప్రజలంతా విశ్వసనీయ సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే వివరాల ఆధారంగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేయనుందని అన్నారు. ప్రణాళిక బద్ధంగా ఇంటింటి సర్వేను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సరైన వివరాలు తీసుకోవాలని కుటుంబ సామాజిక,ఆర్థిక,ఉపాధి,విద్య,కుల సర్వేను పక్కగా నిర్వహించాలని సూచించారు. దీని నివేదిక ఆధారంగానే రాబోయే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీలకు తగిన న్యాయం జరగాలని ప్రభుత్వం ఈనెల 6 నుంచి కులగణన కార్యక్రమం చేపడుతుందని అన్నారు. సర్వేకు వచ్చే అధికారులకు కార్యకర్తలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. 2023 నవంబరు 10 న కులగణన జరగాలని రాహుల్‌గాంధీ చెప్పారని అన్నారు. 1931 తర్వాత ఇప్పటికీ కులగణన జరగలేదన్నారు. అసెంబ్లీలో తాను కులగణన జరగాలని ప్రస్తావించానని తెలిపారు. కులగణన సర్వేతో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు నాయకులు కాసుల బాలరాజ్, వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యులను తయారు చేస్తాం!

- ఇటీవలే నూతన అడ్మిషన్‌ల ప్రక్రియ చేపట్టాం
- వారి కోసం హాస్టల్ వసతి కల్పించి తరగతులు ప్రారంభిస్తాం
- నిర్మాణంలో ఉన్న నూతన బిల్డింగ్ అందుబాటులోకి రానుంది
- గత సంవత్సరం 96 మంది వైద్య విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు
- వారు జీజీహెచ్‌లో వైద్యుల పర్యవేక్షణలో ప్రాక్టికల్ శిక్షణ పొందనున్నారు
- జీఎంసీలో ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగాల నియామకానికి చర్యలు చేపట్టాం
- జీఎంసీ ప్రిన్సిపాల్ శివప్రసాద్

ఇంటర్వ్యూ

కామారెడ్డి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ఉత్తమ వైద్యులను తయారు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులు జీజీహెచ్(గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో) నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రాక్టికల్‌గా శిక్షణ పొందనున్నారని కామారెడ్డి గవర్నమెంట్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ అన్నారు. ఇటీవల నూతన అడ్మిషన్‌ల ప్రక్రియపూర్తయిందని వారి కోసం హాస్టల్ వసతి కల్పించి తరగతులు ప్రారంభిస్తామని, నిర్మాణంలో ఉన్న నూతన బిల్డింగ్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఒప్పంద ప్రాతిపదికన నిర్వహించే ఉద్యోగాల నియామకానికి ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చి చర్యలు చేపట్టామని, ఇప్పటి వరకు 1000కి పైగా దరఖాస్తులు వచ్చాయని పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడతామని శనివారం 'ఆంధ్ర జ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రిన్సిపాల్ వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: కళాశాలలో ఎన్ని సీట్లకు అడ్మిషన్‌లు చేపడుతున్నారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ఏ దామాషా ప్రకారం అడ్మిషన్‌లు ఇస్తున్నారు?

ప్రిన్సిపాల్: కళాశాలలో మొత్తం 100 సీట్లకు అడ్మిషన్‌లు చేపడుతున్నాం. రాష్ట్రంలోని విద్యార్థులకు 85 సీట్లు కేటాయిస్తుండగా, మరో 15 సీట్లు ఆల్ ఇండియా కోటాలో భర్తీ చేస్తున్నాం. ప్రస్తుతం నూతన బ్యాచ్‌కు అడ్మిషన్‌లు పూర్తి చేశాం. మొత్తం ఇప్పటి వరకు 98 మంది విద్యార్థులు అడ్మిషన్‌లు పొందారు. ఇందులో 62 మంది గర్ల్స్, 36 మంది బాయ్స్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: విద్యార్థుల వసతికి సంబంధించి ఏమైన ఇబ్బందులు ఉన్నాయా?

ప్రిన్సిపాల్: నూతనంగా అడ్మిషన్‌లు పొందిన విద్యార్థుల్లో గర్ల్స్ హాస్టల్‌ను అద్దె ప్రాతిపాదికన తీసుకునేందుకు చర్యలు చేపట్టాం. త్వరలోనే వసతి గృహం ఏర్పాటు చేసి విద్యార్థులకు పూర్తిస్థాయిలో తరగతులు ప్రారంభిస్తాం. అంతవరకు ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించేలా చర్యలు చేపడుతున్నాం. అంతేకాకుండా నూతన బిల్డింగ్ నిర్మాణం సైతం పూర్తికావస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అక్కడే తరగతులు మొదలు పెట్టడంతో పాటు వసతి గృహాలను ఏర్పాటు చేయనున్నాం. ఈ కళాశాల భవనంలో ఎంసీహెచ్ ఏర్పాటుకు చర్యలు చేపడతాం.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు అధ్యాపకులు పూర్తిస్థాయిలో ఉన్నారా. ఏమైన ఖాళీలు ఉన్నాయా?

ప్రిన్సిపాల్: కళాశాలలో అవసరమైన వారికంటే తక్కువగానే అధ్యాపకులు ఉన్నారు. కళాశాలలో మొత్తం 28 మంది ప్రొఫెసర్‌లు, 30 మంది అసోసియేట్ ప్రొఫెసర్‌లు, 59 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు ఉండాల్సి ఉండగా ప్రొఫెసర్‌లు 17 మంది, అసోసియేట్ ప్రొఫెసర్‌లు 16, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు 43 మంది ఉన్నారు. గైనిక్ విభాగంలో 8 మంది గైనకాలజిస్టులు ఉండాల్సి ఉండగా ఒకరు, జనరల్ మెడిసిన్‌లో 8 మంది ఉండాల్సి ఉండగా ఒకరు ఉన్నారు. ఇప్పటికే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేశాం. కానీ ఎవరు ముందుకు రాలేదు. ఖాళీలను సైతం భర్తీ చేసేలా ఉన్నతాధికారులకు తెలిపి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.



ప్రిన్సిపాల్ శివప్రసాద్

ఆంధ్రజ్యోతి: గత సంవత్సరం ఎంత మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. ఈ సంవత్సరం ఏమైన ప్రాక్టికల్‌గా శిక్షణ పొందుతారా?

ప్రిన్సిపాల్: గత సంవత్సరం మొత్తం 99 మంది విద్యార్థులకు గాను 96మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. ప్రస్తుతం వారు ద్వితీయ సంవత్సరంలోకి వెళ్లగా వారు జీజీహెచ్‌లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రాక్టికల్ శిక్షణ పొందనున్నారు. వైద్యులకు సహాయకులుగా ఉంటూ శిక్షణ పొందుతారు. వారు చివరి సంవత్సరంలో హౌస్‌సర్జన్ శిక్షణ సమయంలో క్యాజ్‌వాలిటీతో పాటు ఓపీ నిర్వహిస్తారు.

ఆంధ్రజ్యోతి: జీఎంసీలో ఇటీవల విడుదల చేసిన ఉద్యోగ నియామకానికి ఎన్ని దరఖాస్తులువచ్చాయి?

ప్రిన్సిపాల్: జీఎంసీలో ఒప్పంద ప్రాతిపాదికన పని చేసేందుకు ఉద్యోగ నియామకాలకు దరఖాస్తు ప్రక్రియను చేపట్టాం. ఈనెల 1తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఆయా విభాగాలకు కలిపి 1000కిపైగా దరఖాస్తులు వచ్చాయి. స్క్రూట్నీ నిర్వహించిన అనంతరం మెరిట్‌తో పాటు ఆయా సబ్జెక్టుల్లో నిపుణతను, వయస్సు ఆధారంగా నియామకాలు చేపట్టనున్నాం. కలెక్టర్ దిశా నిర్దేశాల ప్రకారం పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడతాం.



ఎల్లారెడ్డి తహసీల్ వద్ద ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మిగిలింది మూడు రోజులే..

- ఈనెల 6 వరకే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల నమోదు
- నత్తనడకన ఎన్‌రోల్‌మెంట్
- ఆసక్తి చూపని గ్రాడ్యుయేట్లు
- పెరగనున్న ఉపాధ్యాయ ఓట్లు
- హోరాహోరీగా ఆశావహుల ప్రచారం

7

ఇంటింటి సర్వేకు ఎన్యూమరేటర్లను నియమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేకోసం అవసరమైన ఎన్యూమరేటర్‌ను నియమించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా అవసరమైన ఎన్యూమరేటర్‌లుగా ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులను నియమించుకోవచ్చని తెలిపారు. ఎన్యూమరేటర్‌లకు అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఏమైన సమస్యలు ఉంటే తెలియజేయాలని తెలిపారు. ఎన్యూమరేటర్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రొజెక్టర్ ఏర్పాటు చేసి నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీపీవో రాజారాం, జడ్పీ సీఈవో చందర్‌నాయక్, డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ దృశ్యం

బోధన్‌రూరల్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని సాలూర తహసీల్దార్ శశిభూషణ్ అన్నారు. శనివారం సాలూర తహసీల్దార్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్య సంరక్షణ కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఖర్చులు చేసుకున్నప్పటికీ సైతం ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ రూపంలో తిరిగి డబ్బులు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్నారవి, సాలూర గ్రామ పార్టీ అధ్యక్షులు అల్లె జనార్ధన్, బోధన్ ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, సాలంపాడ్ వెంకటేశ్వర్ రెడ్డి, సాలూర గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేజీ.గంగారాం, సొక్కం రవి, హున్స కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు. అలాగే బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవిదాస్, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు టప్పొ సాయిలు, నర్సయ్య, జమీల్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి సర్కిల్ కార్యాలయం తనిఖీ



ఎస్పీ సింధు శర్మకు స్వాగతం పలుకుతున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్

ఎల్లారెడ్డి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి సర్కిల్ కార్యాలయాన్ని శనివారం జిల్లా ఎస్పీ సింధు శర్మ వార్షిక తనిఖీలో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌కేసులు లేకుండా చూడాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ సూచించారు. అనంతరం కార్యాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం సర్కిల్ కార్యాలయ ఆవరణాన్ని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బొజ్జు మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయికి దేహశుద్ధి

బోధన్‌రూరల్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): బాలికను వేధిస్తున్న ఆకతాయిని శనివారం బాధిత కుటుంబ సభ్యులు ఆకతాయికి దేహశుద్ధి చేశారు. ఓ పాఠశాలకు చెందిన విద్యార్థినిని ప్రతి రోజు గగన్ అనే యువకుడు వెంబడిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుండగా బాలిక కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో శనివారం ఆకతాయి కుర్రాడిని కుటుంబ సభ్యులు పట్టుకుని గంజ్ కమాన్ వద్ద దేహ శుద్ధి చేశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆకతాయిని అదుపులోకి తీసుకున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా ఐదు అక్రమ రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. బోధన్ తహసీల్దార్ విఠల్, ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అక్రమ రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. మంజీర సరిహద్దు ప్రాంతాల నుండి అర్ధరాత్రి పూట, తెల్లవారుజామున ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారనే పకడ్బంది సమాచారం మేరకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ఐదు అక్రమ రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్మికులపై అధికారులు వేధింపులు మానుకోవాలి

కోటగిరి,నవంబరు2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులపై అధికారులు వేధింపులు మానుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నే సాబ్ కోరారు. కోటగిరి గ్రామ పంచాయతీ కార్మికులు శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు నన్నే సాబ్ హజరై మాట్లాడారు. కార్మికులు వ్యక్తిగత అవసరాల రెండు రోజులు విధులకు రాకపోతే వేతనంలో కోతలు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం మల్టీపర్పస్ విధానం రద్దు చేయడంతో ఉద్యోగ భద్రత కల్పించి నెలకు 26వేల రూపాయల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్‌లతో ఈ నెల 6వ తేదిన జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఈనిరాహార దీక్షను కార్మికులు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పం,చాయతీ కార్మికులు ఆనంద్, పోశెట్టి, సాయిలు, బ్రహ్మం, లక్ష్మి, గంగవ్వ తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

కోటగిరి,నవంబరు2(ఆంధ్రజ్యోతి):పొతంగల్ మండల కేంద్రంలో పీఎస్ఆర్, కేబీఆర్ వాలీబాల్ పోటీలు శనివారం ప్రారంభించారు. ఈ పోటీలను మాజీ జడ్పీటీసీ హెగ్డోలి శంకర్ ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే పోటీలకు 25టీమ్‌లు హాజరయ్యాయి. పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.11,111, ద్వితీయ రూ.5555 అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, మాజీ ఎంపీపీ పవన్, నాయకులు శాంతేశ్వర్ పటేల్, గంధపు రాజు, గంధపు దత్తు తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌పై పేకాట..

రూ.93730లు స్వాధీనం ● బెట్టింగ్ ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు

బోధన్‌రూరల్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పర్గ గ్రామంలో బెట్టింగ్‌పై పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 8సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. బెట్టింగ్ ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుండి 8సెల్‌ఫోన్‌లతో పాటు 93,730రూపాయలను స్వాధీనం చేసుకున్నామన్నారు. యువత బెట్టింగ్‌లపై పేకాట ఆడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యంచ జీపీని తనిఖీ చేసిన ఇన్‌చార్జి డీపీవో

నవీపేట,నవంబరు2(ఆంధ్రజ్యోతి):మండలంలోని యంచ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.గ్రామంలోని పలు వార్డులలో పర్యటించి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, తాగునీటి సరఫరాను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధారాణి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి

బోధన్‌రూరల్,నవంబరు2(ఆంధ్రజ్యోతి):బోధన్ మండలంలోని సంగం గ్రామంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పాతవర్ని గ్రామం నుంచి ట్రాక్టర్‌పై కూలీ పనుల నిమిత్తం పలువురు కూలీలు భవానీపేట్ వస్తున్నారన్నారు. సంగం గ్రామం వద్ద టిఫిన్ చేస్తానని పాతవర్నికి చెందిన కాశీరాం(45)అనే వ్యక్తి నడుస్తున్న ట్రాక్టర్ ట్రాలీకి మధ్యలో ఉన్న రాడ్‌పై నిల్చున్నాడు. ట్రాక్టర్ నడిచే క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడ్డ కాశీరాం ట్రాక్టర్ వెనుక చక్రాల కిందకు వచ్చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.



హైదరాబాద్ రోడ్డు బోర్గాం

అంబేద్కర్‌చౌరస్తాలో కమ్మేసిన మంచు

కమ్ముకున్న పొగ మంచు

నవీపేటలో శనివారం ఉదయం కమ్ముకున్న పొగమంచు

నగరాన్ని కమ్మేసిన పొగమంచు...

నగరాన్ని పొగమంచు కమ్మేసింది. శనివారం ఉదయం 5.30ల నుండి 8గంటల వరకు పొగమంచు నగరాన్ని కమ్మేసింది. నగరంలోని ప్రధాన రోడ్లతో పాటు శివారు ప్రాంతమంతా పొగ మంచుతో నిండిపోయింది. కొన్ని చోట్ల ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కూడా కనబడ లేదు. శివారు ప్రాంతాల్లో, అపార్ట్‌మెంట్‌లు, ఇండ్లను మంచు కమ్మేసింది. చలి కాలం ప్రారంభం కావడంతో చలి తీవ్రత లేకున్నా పొగమంచు రావడం కనబడింది.

● కమ్ముకున్న దట్టమైన పొగమంచు

నవీపేట,నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకుంది. తెల్లవారుజాము నుండి ఉదయం 8గంటల వరకు ఈ పొగమంచు కమ్ముకుంది. దీంతో ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులు పొగమంచు తగ్గే వరకు రోడ్డు పక్కన వాహనాలను నిలిపి ఉంచుకోగా మరికొన్ని వాహనాలను లైట్లు వేసి నెమ్మదిగా వాహనాలను ముందుకు నడిపించారు. పొగమంచును స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంతో పాటు మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్, కొటార్మూర్‌లలో శనివారం వేకువ జామున కమ్మేసింది. దీంతో రోడ్లపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొదటి సారిగా మంచు కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తమ వాహనాలను కొద్దిసేపు నిలిపివేశాయి.

రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

బోధన్‌రూరల్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హున్స సహకార సంఘం అధ్యక్షులు బచ్చల్‌వార్ రవి అన్నారు. శనివారం సాలూర మండలంలోని హున్స గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి తమ ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం ధాన్యానికి 2320, బీ గ్రేడ్ రకం ధాన్యానికి 2300రూపాయలు చెల్లిస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు విక్రయించేందుకు వచ్చేటప్పుడు జిరాక్స్, ధ్రువీకరణ పత్రాలు తమవెంట తీసుకురావాలన్నారు. వ్యవసాయ విస్తీరణ అధికారి జారీ చేసిన రైతు ధృవీకరణ పత్రం పట్టాపాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తప్పకుండా తీసుకురావాలన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ వ్యవసాయ శాఖ అధికారి సంతోష్, ఉపాధ్యక్షులు కులకర్ణి వినోద్ రావు, బోధన్ ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, సొసైటీ డైరెక్టర్‌లు సంజీవ్ పటేల్, శివకుమార్, మాధవరావు, రాములు, సంగారాం, భూమన్న, మైసయ్య, సహకార సంఘం కార్యదర్శి హన్మంత్ రావు, హున్సమందర్నా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



సుంకెట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ మోహన్‌రెడ్డి

● రైతులు వరిధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు

మోర్తాడ్: రైతులు పండించిన వరిధాన్యాన్ని దళారులకు అమ్మిమోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని రామన్నపేట్ సొసైటీచైర్మన్ జాగిరపు మోహన్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని సుంకెట్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాలుకు ఏగ్రేడ్ వరిధాన్యానికి రూ.2320, బిగ్రేడ్ వరిధాన్యానికి రూ.2300 మద్దతు ధర ఇస్తుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ గడ్డం చిరంజీవి, కార్యదర్శి రణవీర్, డైరెక్టర్ శంకర్‌గౌడ్, రవి, రైతులు పాల్గొన్నారు.

● కొత్తపల్లి విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కోటగిరి: కోటగిరి మండలంలోని కొత్తపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొత్తపల్లి, దేవునిగుట్ట, సుద్దులం, సుద్దులం తండా,లింగాపూర్ గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి బోనస్ ధరతో గిట్టుబాటు ధరను పొందాలని సహకార సిబ్బంది సూచించారు.కార్యక్రమంలో గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా మానటరింగ్ అధికారి సత్యనారాయణ రావు, మయూరిలు సందర్శించారు. కేంద్రాల్లో త్వరగా కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. వారి వెంట సీఈవో నారాయణ రెడ్డి, చైర్మన్ రామకృష్ణ, రైతులు, మురళి, జావిద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రారంభమైన మన్మథ స్వామి పాదయాత్ర

బోధన్‌రూరల్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో ప్రసిద్ధి చెందిన పురాణే మఠం నుండి శ్రీక్షేత్ర కపిల్‌ధార్ మన్మథ స్వామి 15వ మహ పాద యాత్ర శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పురాణే మఠంలో పూజలు నిర్వహించి శివాలయం వరకు వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మన్మథ స్వామి పాదయాత్రను ప్రారంభించారు. శ్రీ క్షేత్ర కపిల్ ధార్ పుణ్యక్షేత్ర మన్మథ స్వామి దివ్య జిత్త స్మారక దర్శనం కోసం బోధన్‌లోని వీరశైవ జంగమ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో సుంకిని సిద్దేశ్వర మహరాజ్, మల్లికార్జునప్ప, సంతోష్ మహరాజ్ సౌజన్యంతో పురాణే మఠం నిర్వాహకులు పురాణే అజయ్‌కుమార్ నేతృత్వంలో మహ పాదయాత్ర ప్రారంభించారు. కార్తీక మాసం ప్రారంభమై పౌర్ణమి నాటికి మహరాష్ట్రలోని బీడ్ జిల్లాలో గల మంజార్ సోంబాలో గల వీరశైవ గురు మన్మథ స్వామి దివ్య స్మారకాన్ని దర్శించే వరకు 15రోజుల పాటు భక్తులు భజనలు, కీర్తనలతో కొలాటలతో పాదయాత్రగా ముందుకు సాగుతారన్నారు. అందులో భాగంగా శనివారం బోధన్ నుండి ప్రారంభమైన యాత్ర నాగన్‌పల్లి, సాలూర, ఖాజాపూర్, హున్స, కొల్లూర్ మీదుగా సుంకినికి చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ జంగమ లింగాయత్ ప్రముఖులు వెంకటేశ్వర దేశాయ్, శ్యామ్‌రావు, శివకుమార్ అప్ప, నర్సింగ్ అప్ప, పొడయ్య, రాజేందర్, గంగాధరప్ప, విఠలప్ప, లక్ష్మణ్ పటేల్, యాదవరావు పటేల్, నాగభూషణం, పురాణే దిలీఫ్ కుమార్, మహిళ భక్తులు కమలాబాయి, ప్రభావతి, చంద్రకళ, గోదావరి, గంగాసాగర్, జయశ్రీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



శివాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర

చింతలూర్‌లో ఆదర్శ రైతు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన అధికారులు

● చింతలూర్ సన్నరకం వరి పంటను పరిశీలించిన అధికారులు

జక్రాన్‌పల్లి,, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూర్ గ్రామానికి చెందిన ఆదర్శ రైతు చిన్నికృష్ణుడు (నాగుల చిన్న గంగా రాం) వ్యవసాయ క్షేత్రాన్ని శనివారం వ్యసాయ శాస్త్రవేత్తలు, అధికా రులు సందర్శించారు. ఆదర్శ రైతు చిన్నికృష్ణుడు సాగు చేస్తున్న చింత లూర్ సన్నరకం వరి పంటను అధికారులు పరిశీలించారు. ప్రకృతి వ్య వసాయం ద్వారా పండించిన వరి రకాలను చూసి అధికారులు రైతు చిన్ని కృష్ణుడిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ పథక సంచాల కులు జి.కెన్నాత్ ప్రవీన్, ఆత్మ డీపీడీ దైవాగోరి, మండల వ్యవసా యాధికారి దేవిక, డి.భారత్‌కుమార్, ఆత్మ డీపీఎం అమరేష్, కొలిప్యాక్ సింగిల్‌విండో చైర్మన్, ఆత్మకమిటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, శిక్షణ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

మహంతం రైల్వేగేటు మూసివేత



మహంతం రైల్వే గేటు వద్ద పట్టాలకు మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

నవీపేట,నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతం రైల్వే గేటును శనివారం మధ్యాహ్నం నుంచి రైల్వే అధికారులు మూసివేశారు. నవీపేట, జానకంపేట స్టేషన్‌ల మధ్యనున్న 189నెంబర్ గల రైల్వేగేటు వద్ద పట్టాల మరమ్మత్తుల కోసం శనివారం మధ్యాహ్నం నుంచి ఈ నెల 5వరకు మహంతం రైల్వేగేటును మూసి ఉంచడం జరుగుతుందని సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్.దిగంబర్ తెలిపారు. మహంతం రైల్వేగేటు మూసివేతతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ గమ్యాలకు చేరుకుంటున్నారు.

డైట్ కాస్మోటిక్ ఛార్జీల పెంపుపై ఎల్లారెడ్డిలో గిరిజన బాలికల కృతజ్ఞతలు

ఎల్లారెడ్డి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గురుకుల పాఠశాల విద్యార్థుల కాస్మోటిక్ డైట్ ఛార్జీల పెంపుపై ఎల్లారెడ్డి గిరిజన గురుకుల బాలి కల పాఠశాల ఆవరణలో శనివారం ప్లకార్డులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమ స్యలను గుర్తించి డైట్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదిత రులు పాల్గొన్నారు.

భూచక్రాలు పేలడంతో యువకుడికి గాయాలు

ఆర్మూర్ టౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హుస్నాబాద్ గల్లీలో దీపావళి సందర్భంగా వెలిగించిన పూలకుండిలు, భూచక్రలు పేలడంతో దినేష్ చంద్ర అనే యువకుడికి చేతికి గాయాలయ్యాయి. వ్యాపారస్తులు నాసి రకమైన టపాకాయలు అమ్మడంతో పలు చోట్ల పులకుండిలు, భూచక్రాలు పేలడం తో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థిని స్వేచ్ఛ

దోమకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు గురుకుల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని స్వేచ్ఛ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీత, వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీలత శనివారం తెలిపారు.అక్టోబరు 30న జిల్లా స్థాయి పోటీల్లో స్వేచ్ఛ సత్తాచాటారని, ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. 7 నుంచి 9 వరకు మెద్చల్‌లో జరిగే 68వ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఆమె పాల్గొంటుందని వారు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం..

దోమకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):దోమకొండ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల బాలికల యందు భౌతిక శాస్త్రం సబ్జెక్ట్ బోధించడానికి జూనియర్ లెక్చరర్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్‌పోస్టులకి ఎంఎస్సీ ఫిజిక్స్, బీఈడీ అర్హత గల వారినుంచి దరఖాస్తులు కోరుతున్నాట్లు ప్రిన్సిపాల్ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక డెమో ప్రాతిపదికన చెస్తామని మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు ప్రిన్సిపాల్ 7032641925 నంబర్‌కి సంప్రదించాలన్నారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం



కాకతీయ కాలువలో లభ్యమైన మృతదేహం

మెండోర, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కొండూరు చిన్న గంగాధర్(54) మృతదేహం శనివారం ఉదయం లభ్యమైనట్లు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు శుక్రవారం సాయంత్రం మెండోర బస్టాండ్ ప్రాంతంలో కాకతీయ కాలువలో కళ్లు కడుక్కొవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడని కాలువలో నీటి ప్రవాహం నిలిపివేయడంతో శని వారం ఉదయం మృతుడు పడిన అతిసమీపంలో మృతదేహం లభ్యం కావడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఆర్మూర్‌రూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్మూర్ పట్టణంలోని విజయ్ హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లాస్థాయి సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారుల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు మానస గణేష్, ప్రధానకార్యదర్శి శ్యామ్ తెలిపారు. ఎంపికైన మహిళలకు మోర్తాడ్ బాలికల పాఠశాలలో పురుషులకు రెంజల్ ఉన్నత పాఠశాలలో శిక్షణ శిబిరం నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8వ తేదీ నుంచి హన్మకొండలో జరగనున్న 70వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల, మహిళల బాల్‌బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వారు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి, సంఘ సభ్యులు శ్యామల, సింధుజ, సురేష్, పాఠశాల హెచ్‌ఎం కవిత దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లిలో ఎంపీ అర్వింద్ పరామర్శ



రాజారెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ

జక్రాన్‌పల్లి,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని మునిపల్లి గ్రా మానికి చెందిన మండల బీజేపీ కిసాన్‌మోర్చ అధ్య క్షుడు క్యాతం రాజారెడ్డిని శనివారం సాయంత్రం నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ శనివారం పరామర్శించారు. అనంతరం క్యాతం రాజారెడ్డి ఆరోగ్యం గురించి ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగితెలుసుకు న్నారు. ఎంపీ వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి, మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, గిరిజనమోర్చ జిల్లా అధ్యక్షుడు కిషన్‌నాయక్, నల్లగుట్ట తండా మాజీ సర్పంచ్ మోహన్‌నాయక్, బీజేపీ నాయకులు కుంట శీను, నరేందర్, బీజేపీ కార్యకర్తలు ఉన్నారు.

పంట పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లు



పంట పొలాల్లో కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు

ఆర్మూర్ టౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో పంట పొలాల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ విద్యుత్ స్తంభాలు వంగిపోయాయి. పంటలు పండించుకుంటున్న రైతులకు ఎప్పుడే ఏ విద్యుత్ స్తంభం పడిపోతుందోనని, ఏవైరు తెగిపోతుందని భయంతో పంట పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెర్కిట్ శివారులోని ఎస్ఎస్-15 ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుంతుంది. పంట పొలాలు పండించుకోవడానికి విద్యుత్ స్తంభాలు ఉండగా గత కొన్నేళ్లుగా విద్యుత్ వైర్లు కిందికి వేలాడు తుండడంతో వ్యవసాయ పంట పొలాల్లోకి దున్నడానికి వచ్చే ట్రాక్టర్‌లకు విద్యుత్ వైర్లు తగిలేలా ఉన్నాయని,రాత్రి సమయంలో గాని వేకువజామున వెళ్ళి పంటను పండించుకోవాలంటే భయాందోళనకు గురవుతున్నామని, తక్షణమే విద్యుత్ ఉన్నతాధికారులు విద్యుత్ స్తంభాలను సరి చేసి విద్యుత్ వైర్లను బిగించాలని రైతులు కోరుతున్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

ఆర్మూర్‌టౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలకు సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీం సుల్తాన నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎద గాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, న్యాయవాదులు, బ్యాంకు మేనేజర్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

హసాకొత్తూర్‌లో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కమ్మర్‌పల్లి, నవంబరు 2: (ఆంధ్రజ్యోతి) మండలంలోని హసాకొత్తూర్ గ్రామానికి చెందిన నేవూరి హన్మాండ్లు (65)అనేవ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కమ్మర్‌పల్లి ఎస్‌ఐ అనిల్ రెడ్డి తెలిపారు. గతకొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి, భార్యమరణంతో ఒంటరివాడైన హన్మాండ్లు జీవితంపై విరక్తి కలిగి గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయ సమీపంలోనిపొదల్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. శవం కుళ్లిపోయి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గత ముడురోజులక్రితం మరణించి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటన స్థలం చేరుకున్న పోలీసులు మృతుని కుమారుడు నరేందర్ ఫిర్యాదు మేరకు శవ పంచనామా జరిపి పోస్టుమార్టంనిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌రూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలోని మహాత్మజ్యోతిబాపూలే గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనూష ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాలలో తెలుగు, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, డేటా సైన్స్ సబ్జెక్టులలో బోధించడానికి అర్హులైన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. నెట్,సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని కళాశాల ప్రిన్సి పాల్ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థినిలు ఈనెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు మునిపల్లిలోని కళాశాలలో ఒర్జినల్ సర్టిఫికెట్‌లతో ఇంటర్వ్యూ, డెమోకు హాజరుకావాని కోరారు.



సొంతింటి కోసం ఎదురుచూపులు!

- హామీలకే పరిమితమైన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- అనేక గ్రామాల్లో నిర్మాణాలకు నోచుకోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు
- ఆర్మూర్‌తోపాటు పెర్కిట్, మామిడిపల్లి, అంకాపూర్ గ్రామల్లో ఇళ్ల నిర్మాణాలు
- త్వరలోనే పూర్తికానున్న 136 ఇళ్ల నిర్మాణాలు
- ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్న పేదలు

ఆర్మూర్‌రూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలందరికీ రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పిన గత ప్రభుత్వం పేదలకు ఆశలు చూపింది తప్ప ఇవ్వలేదు. దీంతో బడుగు, బలహీనవర్గాల ప్రజల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. అనేక గ్రామాల్లో డబుల్ బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణాలకు నోచుకోలేదు. ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలలో సుమారు 2 వేలకు పైగా డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా నందిపేట, మాక్లూర్ మండలాల్లో డబుల్‌బెడ్‌రూంల నిర్మాణాలను ప్రారంభించలేదు.

నాలుగు గ్రామాల్లోనే..

ఆర్మూర్ మండలంలోని నాలుగు గ్రామాల్లోనే రెండు పడక గదుల నిర్మాణాలను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్, మామిడిపల్లి, అంకాపూర్ గ్రామాలలో డబుల్ బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంలో 160 రెండు పడక గదుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టగా, అందులో 136ఇళ్లు దాదాపు పూర్తి కావొచ్చింది. కొంత మేరకు మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. మామిడిపల్లిలో వంద ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా ఇక్కడ కూడా పనులు పూర్తి అయి, రోడ్లు, సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం, ఇతర మౌలిక వసతులు పూర్తి చేయాల్సి ఉంది. అంకాపూర్ గ్రామంలో 165ఇళ్లు నిర్మించాలని సంకల్పించి పనులు ప్రారంభించగా 112ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. పెర్కిట్‌లో వంద ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా నిర్మాణాలు పూర్తయ్యి చిన్నపాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది.

అర్హులైన వారికే ఇళ్ల మంజూరు

ఆర్మూర్ పట్టణంతో పాటు అంకాపూర్, పెర్కిట్, మామిడిపల్లి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్లను అర్హులైన వారికే అందజేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు. నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్లను ఇటీవల పరిశీలించిన ఎమ్మెల్యే రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి పారదర్శకంగా ఇళ్లు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. దీంతో డబుల్‌బెడ్‌రూం నిజమైన లబ్ధిదారులకే అందుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారు.

దరఖాస్తు చేసుకున్న వారి ఎదురుచూపులు

ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. వారికి సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందోనని ఆశతో ఉన్నారు. ఏడాదిన్నర క్రితం డబుల్‌బెడ్‌రూంల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు, నాయకులు సూచించడంతో గ్రామాలలో లబ్ధిదారులు అధిక సంఖ్యలో డబుల్ బెడ్‌రూంలకు దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు గ్రామాలలోనే పనులు ప్రారంభించినప్పటికీ సొంతింటి కల నేరవేరుతుందన్న ఆశతో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఎన్నికల మెనిఫెస్టోలో అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణాలకు రూ.5లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇళ్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ.5లక్షలు ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సొంతింటి కల సాకరానికి మోక్షం లభిస్తుందని లబ్ధిదారులు ఆశాభావంతో ఉన్నారు.


డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి (ఫైల్)

వర్సిటీల గౌరవాన్ని పెంచాలి

- వీసీలకు దిశానిర్దేశం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి


ముఖ్యమంత్రితో సమావేశమైన వీసీలు, పాల్గొన్న టీయూ వీసీ

డిచ్‌పల్లి,నవంబరు2 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా వర్సిటీలపై నమ్మకం తగ్గుతోందని, వర్సిటీల్లో వ్యవస్థను దెబ్బతినకుండా వర్సిటీల గౌరవం కాపాడాలని సీఎం రేవంత్‌రెడ్డి వీసీలకు శనివారం జరిగిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. శనివారం సీఎంతో భేటీ అయిన వీసీలు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకృష్ణరెడ్డి, సీఎం సలహాదారులు వేంనరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరి బుర్ర వెంకటేశం వర్సిటీలకు నమ్మకం కలిగేల పనిచేయాలని వర్సిటీల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యాయనం చేయాలని వర్సిటీల ప్రస్తుత పరిస్థితులపై న సమగ్ర అధ్యాయనం అవసరమని, అవసరమైతే కన్సల్టెన్సీ ఏర్పాటు చేసుకొని నివేదిక తయారు చేయలన్నారు. వీసీలకు ఎవరి ప్రభావంతో పోస్టులు ఇవ్వలేదని, మెరిట్ సామాజిక సమీకరణ ఆధారంగా వీసీలను ఎంపిక చేసినట్లు సీఎం తెలిపారు. బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావలన్నారు. తప్పు జరిగితే ఆశ్చర్యకమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని, మంచిగా పనిచేయాలని ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. వర్సిటీలను 100 శాతం ప్రక్షళణ చేయాలని గతంలో వర్సిటీల వీసీలను విద్యార్థులు ఏళ్ల తరబడి గుర్తు పెట్టుకునే వారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. వర్సిటీల్లో డ్రగ్స్ గంజాయి నిర్మూలించలన్నారు. విద్యార్థులను గమనించి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. తెలంగాణ వర్సిటీల్లో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, ఇందుకు ప్రిన్సిపల్ సెక్రటరి బుర్ర వెంకటేశం, సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిలు వివరించారని వీసీ యాదగిరి రావు తెలిపారు.

ప్రతీ ఇంట ఇంకుడు గుంత తప్పనిసరి

- భూగర్భజల శాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్‌బాబు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపసంచాలకులు శ్రీనివాస్‌బాబు

జక్రాన్‌పల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంట ఇంకుడు గుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలని, వర్షపు నీటిని వడిసిపట్టి ఇంకింపజేయాలని భూగర్భజల శాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్‌బాబు అన్నారు. శనివారం జక్రాన్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భూగర్భజల శాఖ ఆధ్వర్యంలో విజన్ సంస్థ సహకారంతో భూగర్భజల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌బాబు మాట్లాడుతూ నీటి ప్రాముఖ్యతపై విద్యార్థుల్లో కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. వివిధ పద్ధతుల ద్వారా భూగర్భజలాలు పెరగాలని, నీటి జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం విజన్ సంస్థ డైరెక్టర్ కైలాస్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకొని భూగర్భజలాలు పెంచేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు భూగర్భజల పరిరక్షణపై వ్యాసరచన పోటీలు, వివిధ పోటీలు నిర్వహించగా గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు.

మిగిలింది మూడు రోజులే..

- ఈనెల 6 వరకే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల నమోదు
- నత్తనడకన ఎన్‌రోల్‌మెంట్
- ఆసక్తి చూపని గ్రాడ్యుయేట్లు
- పెరగనున్న ఉపాధ్యాయ ఓట్లు
- హోరాహోరీగా ఆశావహుల ప్రచారం

ఎల్లారెడ్డి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల కోసారి జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల్లో ఓటేసే అవకాశం పొందాలంటే మరో మూడు రోజులే మిగిలింది. ఓటరుగా నమోదుకు వచ్చేనెల 6 వరకే గడువుంది. గడిచిన సెప్టెంబరు 30 నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలైంది. ఫారం-18 ద్వారా పట్టభద్రులు, ఫారం-19 ద్వారా ఉపాధ్యాయులు తమ వివరాలను సమర్పించి ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాల్సి ఉంది. అయితే అధికారుల వైపు నుంచి ఓటరు నమోదు ప్రక్రియ గురించి మొక్కుబడిగానే అవగాహన కార్యక్రమాలు ఉంటున్నాయి. ఓటునమోదుపై ఆయావర్గాల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నాలు జరగడం లేదనే విమర్శలు నెలకొన్నాయి.

2019 మార్చి నెలలో నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్- మెదక్ శాసన మండలి ఎన్నికలు జరిగాయి. అప్పుడు పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి విజయం సాధించగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూర రఘోత్తంరెడ్డి గెలుపొందాడు. వచ్చే మార్చి 29వ తేదితో వీరి పదవీ కాలం ముగియనుంది. అప్పటి లోగా ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేసి మళ్లీ ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. నవంబరు 6 వరకు నమోదు ముగుస్తుండగా డిసెంబర్ నెలలో తుది జాబితా ప్రకటిస్తారు. ఆ తర్వాత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

● ఆసక్తి చూపించని పట్టభద్రులు

ఓటు నమోదు ప్రక్రియపై పట్టభద్రులు ఆసక్తి చూపించడం లేదనే చర్చ జరుగుతోంది. ఆరేళ్ళ క్రితం కూడా నాలుగు ఉమ్మడి జిల్లాలు కలిపి కేవలం 1,96,321 మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే ఓటు హక్కు పొందారు. ఒక్క ఏడాదిలో డిగ్రీ, బీటెక్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసే వారి సంఖ్య నాలుగు జిల్లాల్లో లక్షల్లో ఉంటుంది. గత ఎన్నికల నాటికి 10 లక్షల మందికి తక్కువ కాకుండా పట్టభద్రులు ఉన్నాఓటర్ల సంఖ్య కనీసం రెండు లక్షల కూడా దాటకపోవడం గమనార్హం. ఆరేళ్ళ తరువాత జరుగుతున్న ఈ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. కానీ ఇప్పుడు కూడా ఓటుహక్కు నమోదు చేసుకోవడానికి నిరాసక్తత కనబరుస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకునే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు, రెవెన్యూ కార్యాలయాల్లోనూ కౌంటర్లు ఏర్పాటు చేశారు.

● ప్లీజ్ ఫారం నింపండి అంటూ..



ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రేసులో 10 మంది దాకా ఆశా వహులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గ్రాడ్యుయేట్ల ఓట్లతోనే వీరి గెలుపోటములు ఆధారపడి ఉన్నందున తమ ఆధ్వర్యంలోనే ఓట్లు నమోదైతే తమకు విశ్వాసం ఉంటుందని అనుకుంటున్నారు. అందుకే పట్టభద్రుల్లో చైతన్యం తెచ్చేలా ప్లెక్సీలు కడుతున్నారు. సోషల్ మీడియా, వాట్సాప్, ఫేస్ బుక్‌ల ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరుతున్నారు. గ్రాడ్యుయేట్ పూర్తి చేసి అర్హ త ఉన్న వారి ఫోన్ నెంబర్లు తీసుకుని ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయా లని అడుగుతున్నారు. నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా కార్యాలయాలు తెరిచి ఫారం-18లను పంపిణీ చేస్తున్నారు. కొందరైతే ఇంకో అడుగు ముందుకేసి పట్టభద్రుల ఇళ్ళకు వెళ్లి ఫారం నింపాలని వేడుకుంటున్నారు. పట్టభద్రుల డిగ్రీ, ఆధార్, ఓటరు ఐడీ జిరాక్స్ పత్రాలు సేకరిస్తూ ఫారంలపై వారి సంతకాలు తీసుకుని ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా ఆశా వాహులే అప్లయ్ చేస్తున్న పరిస్థితి నెలకొంది. గడువు సమీపిస్తుండటంతో హడావుడి ఎక్కువైంది.

● పెరగనున్న ఉపాధ్యాయుల ఓట్లు

నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికు సంబంధించి 2019లో సుమారు 21 వేల ఓట్లు ఉన్నాయి. అయితే ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నా యి. 1-11-2018 నుంచి 31-10-2024 వరకు హైస్కూళ్లు, ఆ పైన ప్రభుత్వ విద్యా సంస్థల్లో మూడేళ్లపై బోధన చేస్తున్న ఉపాధ్యాయులు ఓటు హక్కుకు అర్హులు. హైస్కూళ్లు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, గురుకులాలు, మోడల్, కస్తూర్బా పాఠశాలలు, ప్రభుత్వ ఇంజనీరింగ్, మెడికల్ ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో పని చేసే అర్హులైన వారందరికీ ఓటుహక్కు పొందే అవకాశం ఉంది. ఇక విద్యాశాఖ నిబంధనల ప్రకారం వేతనాలు పొందే ప్రైవేట్ విద్యా సంస్థల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు కూడా అర్హత పొందవచ్చు. గడిచిన ఆరేళ్ల వ్యవధిలో ప్రభుత్వ విద్యా సంస్థలు పెద్దసంఖ్యలో నెలకొల్పబడ్డాయి. ఉపాధ్యాయులు, అధ్యాపకులు రిక్రూట్ అయ్యారు. అందుకే ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్య 50 వేల మార్కును చేరుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఏదేమైనప్పటికీ గతం కంటే భిన్నంగా ఓటర్ల నమోదుపై ఆశా వాహులు దృష్టి పెట్టారు. ఎన్నికల నిర్వహణకు మరో ఐదు నెలల సమయం ఉన్న ప్పటికీ ప్రచారంలో వెనక్కు తగ్గడం లేదు. ఫలితంగా రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా ఉంటాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి.



ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

భక్తి

శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో

కార్తీక మాస ప్రత్యేక పూజలు

- ప్రతీ రోజు దీపారాధన
- కార్తీక పౌర్ణమి రోజు పుష్కరిణిలో ప్రత్యేక దీపారాధన కార్యక్రమం

భిక్కనూరు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి, వేములవాడ దేవాలయాలతో సమానం దక్షిణకాశీగా బాసిల్లుతున్న భిక్కనూరు మండలకేంద్రంలోని శ్రీపార్వతి సిద్ధరామేశ్వర ఆలయం శివకేశవులకు ప్రీతిపాత్రమైనటువంటి కార్తీకమాస ప్రత్యేక పూజలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ కార్తీక మాస ప్రత్యేక పూజల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను, దీపోత్సవాలు నిర్వహించడానికి దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, అర్చకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆయానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా, ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో శ్రీధర్, ఆలయ కమిటీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు. కార్తీకమాస ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ప్రతీరోజు రాత్రి 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో దీపారాధనతోపాటుగా కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ పుష్కరిణీలో ప్రత్యేక దీపారాధన కార్యక్రమం, జ్వాల తోరణము, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

తపస్సంపన్నులైన శ్రీ సిద్ధగిరి, రామగిరి అనే యోగి పుంగవులు భిక్షాటన చేస్తూ భిక్షపతిప్రోలు(ప్రసుత్త భిక్కనూరు)కు చేరుకున్నారు. ఈ భిక్కనూరు గ్రామం వీరికి అతివైభవంగా, ఆశ్చర్యకరంగా కన్పించిందని దీంతో వీరిరువురు ఇక్కడ విశ్రాంతి తీసుకున్నారు. సుప్రభాతవేళ ఓ ఆవు యోగి పుంగవులకు కొద్ది దూరంలో పుట్టపై పాలు స్రవించి, పుట్ట చుట్టు ప్రదక్షణలు చేసి పూర్వాభిముఖంగా పరిగెత్తిందని పూరణగాథ. ఇది చూసిన యోగి పుంగవులు ప్రదక్షణలు చేసి అక్కడ మరుసటిరోజు కూడా అక్కడే నిద్రించారు. ఆ రాత్రి పరమశివుడు యోగి పుంగవులకు స్వప్నంలో ప్రత్యక్షమై నేను ఈ పుట్టలో ఉన్నానని, ఇక్కడ ఆలయాన్ని నిర్మించాలని వారికి ఆదేశించాడట. ఆలయ నిర్మాణానికి కావల్సిన ధనాన్ని పోగు చేసేందుకు శివుడు వారికి ఒక తాళ్లపత్ర గ్రంథాన్ని ఇచ్చి అదృశ్యమైనట్లు చెబుతారు. యోగి పుంగవులు ఆలయ నిర్మాణానికి సిద్ధమై ఒక చక్రాల బండిని సిద్ధం చేసి దానికి నాగబండి అని నామకరణం చేసి, శివుడు ఇచ్చిన తాళ్లపత్ర గ్రంథాన్ని దానిపై పెట్టి దేశమంతా తిరిగి నిధులు సమకూర్చి ఆలయాన్ని నిర్మించారని చరిత్ర చెబుతోంది. సిద్ధగిరి, రామగిరి ఇరువురు ఈశ్వరుడి ఆలయాన్ని నిర్మించడంతో శ్రీసిద్ధరామేశ్వరాలయంగా పేరు వచ్చినట్లు పూర్వీకులు చెబుతారు.



ఆలయ ఉప ఆలయాలు

శ్రీపార్వతి సిద్ధరామేశ్వర ఆలయంలో మాతాభువనేశ్వరి మాతా, కుమారస్వామి, దత్తాత్రేయ, హనుమాన్, వీరభద్ర, నవగ్రహ ఆలయాలు ఉన్నాయి. ఆలయ సమీపంలో హరహరపుత్ర అయ్యప్ప ఆలయం ఉంది.


ఆలయంలో కొలువుదీరిన నందీశ్వరుడు

మూలబావి ప్రత్యేకత

ఆలయంలోని మూలబావి ఎంతో పవిత్రమైనది. పాతాళగంగతో సమానంగా భావించే ఈ బావిలోని నీటితో దీర్ఘకాలిక వ్యాదులు నయమవడంతోపాటు ఈ నీటితో స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ బావిలో నీరు ఎప్పుడు ఉంటాయి. దీంతోపాటుగా ఇటీవల అన్నిహంగులతో మరమత్తులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చిన ఆలయానికి ఎదురుగా ఉన్న కోనేరు అదనపు ఆకర్షణ.

ఆలయానికి ఎలా చేరుకోవాలంటే..

ఆలయానికి 44వ జాతీయరహదారి, రైలు మార్గం ద్వారా చేరుకోవచ్చు. మండలకేంద్రానికి 2కిలోమీటర్ల దూరం ఉన్న ఈ ఆలయం కామారెడ్డి నుండి 25కిలోమీటర్లు, దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు భిక్కనూరుకు చేరుకుంటే అక్కడి నుంచి ఇతర వాహనాలు అందుబాటులో ఉంటాయి. భిక్కనూరు రైల్వేస్టేషన్ నుంచి వాహానాలు అందుబాటులో ఉంటాయి.

భక్తులకు సౌకర్యాలు

దేవాదాయ, దర్మదాయ ఆధీనంలో ఉన్న ఈ ఆలయంలో భక్తులకు ప్రత్యేక గదులు, టీటీడీ కళ్యాణ మండపం, వాసవి నిత్య అన్నదాన సత్రం ఉన్నాయి.

ఇంటింటి సర్వేకు సహకరించాలి

● ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



భిక్కనూరులో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

భిక్కనూరు, నవంబరు 2: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం భిక్కనూరు మండలకేంద్రంలో కర్నాల శ్రీనివాస్‌కు మంజూరైనా రేషన్ దుకాణాన్ని షబ్బీర్‌అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఇంటికి వచ్చే అధికారులకు ప్రజలు పూర్తి వివరాలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమం పట్ల ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. అనంతరం షబ్బీఅలీని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్ర కాంత్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కామారెడ్డిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ సలహదారు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని సైలాన్‌బాబా కాలనీలో రేషన్‌డీలర్ ఫణిందర్‌కు కేటాయించిన నూతన రేషన్‌దుకాణాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పేదలకు ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి వారిని ఆదుకోవాలని నిర్ణయించిందని అన్నారు.త్వరలో ఇంటింటి సర్వే నిర్వహించి రేషన్ కార్డు లేనివారికి రేషన్‌కార్డులు అందిస్తామని తెలిపారు. వచ్చేనెల నుండి చౌకధరదుకాణాలలో పేదలకు సన్నబియ్యం అందిస్తామని తెలిపారు.అంతకముందు పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులనుపంపిణీచేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పండ్ల రాజు,ఐరేని సందీప్,షేర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు



కొండా సురేఖకు దీపావళి శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే

పెద్దకొడప్‌గల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను శుక్రవారం రాత్రి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావ్ కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావ్ మాట్లాడుతూ జుక్కల్ నియోజక వర్గంలో దేవాదాయ శాఖకు చెందిన భూములు అన్యాక్రాంతం అయ్యాయని వాటిని తిరిగి స్వాధీనం చేసుకుని సంబందిత దేవాలయాలకు అప్పగించాలని మంత్రికి కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అంతేగాక స్వాధీనం చేసుకున్న భూములలో ఆయిల్ పామ్ మొక్కలను పెంచితే ఆదాయం సమకూరుతుందని మంత్రికి వివ రించినట్లు తెలిపారు.

పోల్కంపేటలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

లింగంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలోని పోల్కంపేటలో శనివారం సీసీరోడ్డు పనులను పంచాయతీ కార్యదర్శి అశ్వక్ ప్రారంభించారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు రోడ్డు బాగులేదని గ్రామస్థులు ఎమ్మెల్యే మదన్‌మోహన్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన నిధులను మంజూరు చేశారని వాటితో సీసీరోడ్డు వేస్తున్నట్లు గ్రామస్థులు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగరాజు, అజయ్‌గౌడ్, సాజిద్‌ఖాన్, శ్రీనివాస్, సాయిబాబా ఉన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాల్లో తూకం వెంటనే ప్రారంభించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కామారెడ్డిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల వడ్ల కొనుగోలు కేంద్రాలలో తూకం వెంటనే ప్రారంభించాలని తెలంగాణ జనసమితి నాయకులు అన్నారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల వడ్లు కల్లాలకు తెచ్చి 25 రోజులు కావస్తుందని కొనుగోలు కేంద్రాల్లో కొబ్బరికాయలు కొట్టారే తప్ప తూకం ప్రారంభించలేదన్నారు. ప్రైవేట్ వ్యక్తుల దగ్గర తెచ్చిన అప్పులు కట్టడానికి రైతులు దళారులకు పంటను అమ్ముకుని నష్టపోతున్నారన్నారు. వర్షాలు పడుతున్నాయి నెలల తరబడి కష్టంచేసిన వృధాఅవుతుందని రైతులకు తీవ్ర నష్టం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిజ్జన రమేష్, కుంబాల లక్ష్మణ్‌యాదవ్, రజినికాంత్, నాగరాజు, పోచయ్య పాల్గొన్నారు.

స్పెషల్ డీఎస్సీలో ఎంపిక

లింగంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమడుగు గ్రామానికి చెందని కొండ సంజీవులు స్పెషల్ డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపిక కావడంతో శనివారం డీఈవో రాజు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఆయనకు బీబీపేట మండల కేంద్రంలోని తిమ్మయ్యగారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చినట్లు ఆయన తెలియజేశారు. ఆయన 12 సంవత్సరాలుగా లింగంపేట మండలంలోని నల్లమడుగు క్లస్టర్‌లో రీసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వహించారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందేలా కార్యక్రమాలు

● ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

సదాశివనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం సదాశివనగర్ మండల కేంద్రంలో ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పాలన వస్తుందని చెప్పి అధికారంలోకి రాగానే మహిళలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలను అందజేయడం జరిగిందన్నారు. సదాశివనగర్‌లో మహిళ శక్తి క్యాంటిన్ ఏర్పాటుచేయాలన్న విషయాన్ని తన దృష్టికి ఐకేపీ వారు తీసుకువచ్చిన వెంటనే సదాశివనగర్‌లో గతంలో నిర్మించి ఖాళీగా ఉన్న ఎస్సీ కార్పోరేషన్ భవనాన్ని సిద్ధంచేయడానికి కృషిచేయడం జరిగిందన్నారు. మండల కేంద్రంలోని ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్‌ను మహిళలు సమర్థవంతంగా నిర్వహించి లాభాలు పొంది మంచి పేరుపొందినట్లయితే నియోజకవర్గంలో మరిన్ని ప్రాంతాలలో మహిళ శక్తి క్యాంటిన్లను ఏర్పాటుచేయానికి మహిళలు ముందుకు వస్తారని తెలిపారు. అదేవిధంగా అడ్లూర్ ఎల్లారెడ్డిసొసైటి పరిధిలోని కుప్రియల్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. గోదాం నిర్మాణానికి కావాల్సిన భూమిని సీసీఎల్‌ఏలో మాట్లాడి ఇప్పిస్తానని తెలిపారు. గ్రామానికి రోడ్డు విస్తరణ కూడా చేపట్టాలని గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరగా చేయిస్తానని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాలలో అవకతవకలు లేకుండా రైతులకు మోసం జరగకుండా తూకం వేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎవరైన అక్రమ వసూళ్లకు పాల్పడితే నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రైతులను ఇబ్బంది పెట్టి కార్యక్రమాలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్, జడ్పీ సీఈవో చందర్‌నాయక్,తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, ఏపీఎం రాజారెడ్డి, సమాఖ్య అధ్యక్షురాలు శోభ, పార్టీ మండల అధ్యక్షుడు సంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంధ్యానాయక్, నాయకులు లింగగౌడ్, ఇర్షాద్, రూపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌పై కాషాయజెండా ఎగరాలి

● కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డిటౌన్,నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్‌పై కాషాయజెండా ఎగరాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో కామారెడ్డి పట్టణ కార్యవర్గసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కామారెడ్డి మున్సిపల్‌పై కాషాయజెండా ఎగరాలని అందుకు ప్రతీ కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని వారికి అందు బాటులో ఉండి వారి సమస్యలను పరిష్కారం చూపేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఒక్కస్థానం వదలకుండా 49 వార్డుల్లో బీజేపీ విజయం సాధించే విధంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి,కౌన్సిలర్‌లు శ్రీకాంత్, శ్రీనివాస్, నరేందర్, పట్టణ అధ్య క్షుడు భరత్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

దోమకొండ: ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు రికార్డును పరిశీలించారు.

దోమకొండ, బీబీపేటలలో సమావేశం

దోమకొండ: దోమకొండ, బీబీపేట మండలాల్లో శనివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి హజరై మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుని నుంచి మొదలుకొని జడ్పీ చైర్మన్ వరకు బీజేపీ కైవసం చేసుకోవాలని సూచించారు.

వడ్ల కొనుగోలు వెంటనే ప్రారంభిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కొనుగోలు కేంద్రాల నుంచి వరిధాన్యాన్ని త్వరగతిన తరలించేందుకు కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. శనివారం దోమకొండ మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం ఆవరణలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ధాన్యాన్ని తరలించేందుకు కలెక్టర్‌తో పాటు అధికారులు సిద్ధంగా ఉన్నారని సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారని రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంట లక్ష్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, మద్దూరి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎన్ ఫార్మా కంపెనీ ఎదుట కార్మికుల ధర్నా



భిక్కనూరు ఎంఎస్‌ఎన్ ఫార్మా ఎదుట బైఠాయించిన కార్మికులు

భిక్కనూరు, నవంబరు 2: సరిగా వేతనాలు ఇవ్వడం లేదని, సమయవేళలు పాటించకుండా తమతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆరోపిస్తూ భిక్కనూరు మండలంలోని ఎంఎస్‌ఎన్ ఫార్మా కంపెనీ డైలీవైస్ కార్మికులు శనివారం కంపెనీ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ మేరకు కంపెనీ గేటు వద్ద బైఠాయించి కంపెనీ అధికారులకు తమకు న్యాయం చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఎంఎస్‌ఎన్ ఫార్మాలో ప్రతిరోజు ఆయాబ్లాకులలో పనిచేసే కార్మికులతో సమయవేళలు పాటించకుండా అధిక సమయం పనిచేస్తున్నారని, సరిగ్గా వేతనాలు సైతం సరిగ్గా ఇవ్వకుండా కంపెనీ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తమకు ఈఎస్ఐ, పీఎఫ్ సైతం చెల్లించడం లేదని ఆరోపించారు. గతంలో తమకు భోజన సదుపాయం ఉండేదని, ప్రస్తుతం పెట్టడం లేదన్నారు. ఈ విషయమై కంపెనీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఆందోళనతో కంపెనీ మేనేజర్ సుబ్బారావు, హెచ్‌ఆర్ వర్మ అక్కడికి చేరుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని నాలుగు రోజుల్లో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు.

ధాన్యం నిల్వ చేసేందుకు గోదాంలను గుర్తించాలి

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరాఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా జిల్లా కలెక్టర్‌లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వం కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని అన్నారు. సన్నరకం ధాన్యం, సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో రైస్‌మిల్లర్ల వద్ద తాళ్ల పేరుతో ఎటువంటి ధాన్యం కోతలు చేయవద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయాలని, రైతులకు ఎటువంటి నష్టం రావడానికి వీలులేదని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో రైస్‌మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంక్ గ్యారెంటి తప్పనిసరి చేస్తు ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీచేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలుచేయాలని అన్నారు. రైస్‌మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని, బ్యాంక్ గ్యారెంటి సమర్పించని పక్షంలో జిల్లాలోకొనుగోలు చేసిన ధాన్యం భద్రపరిచేందుకు అవసరమైన మేర ఇంటర్మీడియట్ గోడౌన్ సన్నద్ధం చేయాలని, ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు ఫోన్‌నంబర్‌తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుచేయాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో 423 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించామని తెలిపారు. కేంద్రాలలో అన్ని ఏర్పాటుచేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రాజేందర్, ఇంచార్జ్ పౌర సరాఫరాల అధికారి నరసింహరావు, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, డీఏఓ తిరుమల ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ రైతు పొలం బాట

రాజంపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొందుర్తి, శివాయిపల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహించినట్లు ఏడీఈ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో రైతులతో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని రైతులు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, విద్యుత్ పొదుపు, కెపాసిటర్లు అమర్చడం తెగిపడిన విద్యుత్ వైర్లు, లూజు లైన్‌లు వంగిన స్తంభాలు, విరిగిన స్తంభాలు చెట్టుకొమ్మలు తగలడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈ నాందేవ్, విజయభాస్కర్, లైన్‌మెన్ హుస్సేన్, విద్యుత్‌సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల అలాట్‌మెంట్ లేకుండా తూకాలు వేసి ఏం చేస్తారు

సదాశివనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లుల అలట్‌మెంట్ లేకుండా తుకాలు వేసి ఏంచేస్తారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకాలు నిర్వహించడానికి జడ్పీ సీఈవో చందర్‌నాయక్, తహసీల్దార్ గంగాసాగర్, చైర్మన్ కమలాకర్‌రావు వచ్చారు. ఈ సమయంలో అక్కడికి రైతులు చేరుకుని మిల్లులనే అలాట్‌మెంట్ చేయకుండా ధాన్యం తుకాలు వేసి రైతులను మరింత నష్టం కలిగేలా చేస్తారా అని వెంటనే అలాట్‌మెంట్ చేసే వరకు తుకాలు నిలిపివేయాలని అన్నారు.

బీర్కూర్ కళాశాలను తనిఖీ చేసిన నోడల్ అధికారి



బీర్కూర్ కాలేజీలో అధ్యాపకులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి షేక్ సలాం

బీర్కూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఎప్సెట్ తరగతులను శనివారం జిల్లా ఇంటర్‌మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి ఎప్సెట్ తరగతులు నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. తరగతుల నిర్వహణ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు పట్టికల రిజిష్టర్‌లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన అధ్యాపకులతో సమావేశ మయ్యారు. కళాశాలలో ఎప్సెట్ తరగతులు నిర్వహిస్తున్న తీరును, పరీక్షలు ఎదుర్కొనేందుకు గాను విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అమలు చేస్తున్న ప్రణాళికలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు నోడల్ అధికారికి వివరించారు. అధ్యాపకుల పని తీరుపై నోడల్ అధికారికి షేక్ సలాం సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కాలేజీల్లోనూ ఎప్సెట్ కోసం విద్యార్థులను సిద్ధం చేస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బీసీ గురుకుల పాఠశాలను నోడల్ అధికారి సలాం సందర్శించారు.

చలో చలో.. పోచారం

(5పేజీ తరువాయి)

చేయాలని స్థానికతను వివరించే విధంగా మ్యూజియంను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ ఆ ప్రతిపాదనలు అమలు కాలేకపోయాయి. ప్రాజెక్టుపై కనీస సౌకర్యాలు లేకపోవడం కారణంగా పర్యాటకు లకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థాని కులు వివరించడంతో ప్రాజెక్టు వద్ద మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేసేందుకు అధికా రులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

పర్యాటక కేంద్రంగా మారుస్తామన్న స్థానిక ఎమ్మెల్యే

కామారెడ్డి, మెదక్ ఉభయ జిల్లాలకు పర్యాటక ప్రాంతమైన పోచారం ప్రాజెక్టు, అభయారణ్యాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామని స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఇటీవల ప్రకటించారు. సంబంధితశాఖ మంత్రితో పాటు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో ప్రాజెక్టును పరిశీలించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. గతంలోనే ప్రాజెక్టు పక్కనే అభయారణ్యం ఉండడంతో పర్యాటక ప్రాంతానికి అనువైనదిగా గుర్తించారు. పర్యాటకుల తాకిడి పెరుగుతుండడంతో పర్యాటక స్థలంగా తీర్చిదిద్దేందుకు అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టినా పనులు ముందుకు సాగలేదు. పోచారంను పర్యాటక స్థలంగా ప్రభుత్వం తీర్చిదిద్దినట్లయితే ఇటు పర్యాటకులకు అటు కామారెడ్డి, మెదక్ జిల్లాలకు ఎంతగానో ఉప యోగంగా ఉంటుంది.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

● రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొంటుంది
● రైతులెవరూ అధైర్యపడొద్దు
● రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం



బాన్సువాడలో సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న పోచారం

కామారెడ్డి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల పరిధిలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, అందుకు సంబంధించి రైస్ మిల్లర్లకు అలాట్మెంట్ కూడా చేయడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం బాన్సువాడలోని తన స్వగృహంలో ధాన్యం కొనుగోళ్ల విషయమై.. కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సంబంధిత అధికారులతో పోచారం చర్చించారు. ఈ సందర్భంగా రైస్‌మిల్లర్లతోనూ సమావేశం అయ్యారు. అనంతరం పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పండించిన ప్రతీ గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ విషయంలో రైతులెవరూ అధైర్య పడొద్దని సూచించారు. ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలను రైతులు పాటించాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి.. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని పోచారం కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, జిల్లా రైతు బంధు మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బుడ్మి మాజీ సొసైటీ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్, రైస్ మిల్లర్లు వెంకన్న, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్‌బాబు



పెద్దమల్లారెడ్డిలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

భిక్కనూరు, నవంబరు 2: రైతులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తమ సిబ్బంది సూచనలతో పాటుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్‌బాబు అన్నారు. శనివారం భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డిలో ట్రాన్స్‌కో అధికారులు రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ మోటార్లకు కెపాసిటర్లను పెట్టుకోవాలని, ఇనుప స్టార్టర్ డబ్బాలకు బదులు ప్లాస్టిక్ స్టార్టర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, వ్యవసాయబావుల వద్ద ఏమైనా విద్యుత్ సమస్యలుంటే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని వారు అక్కడి చేరుకుని రైతుల సమస్యలను పరిష్కారిస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ కళ్యాణ్‌చక్రవర్తి, నాగరాజు, ఏడీఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ సంకీర్త్, సిబ్బంది పాల్గొన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్



లింగంపేటలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

లింగంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు పేరుకుపోయాయని అకాల వర్షంతో రైతులు నానా తిప్పలు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం లింగంపేట మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలిసి మాట్లాడారు. చేతికి వచ్చిన ధాన్యం అకాల వర్షం కారణంగా తడిసిపోతుంటే ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలియజేశారు. ఇప్పటికే 20 రోజులుగా కేంద్రాల వద్ద ధాన్యం పోసుకుని రైతులు కాపలా కాస్తున్నారని ఆయన తెలియజేశారు. రైతుల కష్టాన్ని గుర్తించి, ధాన్యం ఆరబోసేందుకు తీసుకు వచ్చిన టాపర్ల కిరాయి రూ.1000 నుంచి రూ.2000వరకు పెరిగిందని ప్రభుత్వం వెంటనే కొనుగోలు ప్రారంభించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, రమేష్‌లతో పాటు సావిత్రి రైతులు ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- లక్కీ భాస్కర్
దర్శన్	- సింగం అగేన్
ప్రియా 35	- అమరన్
ప్రియా 70	- లగ్గం

బాన్సువాడ

మహేశ్వరి	- వేట్టయన్ (ది హంటర్)
వెంకటేశ్వర	- అమరన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

